క్లుప్తంగా

వాహనాల తనిఖీ

శ్రీరంగరాజపురం: మండలంలోని మెదవాడ పంచాయతీ దిగువ మెదవాడ చిత్తూరు–పుత్తూరు రహదారి వద్ద ఎస్‌ఐ రాజుకుల్లాయప్ప శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. అనంతరం డ్రైవింగ్ లైసెన్సు, వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్ నిర్మాణానికి స్థల పరిశీలన



చెక్‌డ్యామ్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పాలసముద్రం : మండలంలోని నరసింహపురం చెరువులో నుంచి వృథాగా పోతున్న నీటిని అరికట్టేందుకు చెక్‌డ్యామ్ నిర్మాణానికి శనివారం ఎంపీడీఓ రామనాథరెడ్డి, ఇరిగేషన్ ఏఈ చీరాలయ్య స్థలాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ రామనాథరెడ్డి మాట్లాడుతూ నరసింహపురం చెరువులో నీరు నిండి మొరవపోతున్న నీరు తమిళనాడుకు వెళ్లిపోతుందన్నారు. అందువల్ల వృథాగా వెళ్లే నీరు ఇక్కడి రైతులకు ఉపయోగపడేలా చేయాలని విన్నవించుకున్నారని తెలిపారు. అందువల్ల చెక్‌డ్యామ్ నిర్మాణానికి క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీస్తున్నట్లు చెప్పారు. త్వరలో చెక్‌డ్యామ్ మంజూరు చేసి నిర్మాణ పనులు చేపడతామని ఇరిగేషన్ ఏఈ చీరాలయ్య తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మధు, మండల విస్తరణాధికారి రమేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమ పూజలు



ప్రత్యేక అలంకరణలో కలశాలు

నగరి : మున్సిపల్ పరిధిలోని పుదుపేట నాగాలమ్మ ఆలయంలో శనివారం కుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా హోమపూజలు ఘనంగా జరిగాయి. పండితులు శ్రీనివాస అయ్యర్ ఉదయం గణపతిపూజ, స్వస్తివాచనం పూజలు నిర్వహించారు. సాయంత్రం వాస్తు పూజ, కలశస్థాపన పూజ, అగ్ని ప్రదక్షిణ, లఘు పూర్ణాహుతి పూజలు చేపట్టారు. రాత్రి నూతన విగ్రహాలను ఆలయంలో ప్రతిష్టించారు. ఆదివారం మహా కుంభాభిషేకం, మహా అభిషేకం, ఉత్సవమూర్తుల ఊరేగింపు ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన



క్యాన్సర్లపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హేమంత్

పుత్తూరు: క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రత్యేకించి మహిళలు అవగాహన కలిగి ఉండాలని టాటా ట్రస్ట్ అధికారి హేమంత్ తెలిపారు. శనివారం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తల నిమిత్తం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైనందిన జీవితంలో ప్రత్యేకించి మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. మహిళల్లో గర్భసంచి, రొమ్ము, నోటి క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే దాన్ని జయించవచ్చన్నారు. ఆకులు, వక్కలు తరచూ తినడం, మద్యపానం, గుట్కాల వంటి అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. శిబిరంలో రక్తపోటు, మధుమేహం, హెపటైటిస్ బి, నోటి, రొమ్ము, గర్భాశయం క్యాన్సర్లకు సంబంధించి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు హేమంత్, వెంకయ్యబాబు, రెడ్డికుమారి, మెహతాజ్ వినీతలు వైద్య సేవలందించారు. సీడీపీఓ పద్మజ, సూపర్‌వైజర్లు గీతాంజలి, సంధ్య, అనిత తదితరులు పాల్గొన్నారు.

రాజనాలబండ భక్తులకు మెరుగైన సేవలు



సిబ్బందికి సూచనలిస్తున్న శ్రీనివాసరావు

చౌడేపల్లి: సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో భక్తులకు మెరుగైన సేవలందించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు టీటీడీ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం రాజనాలబండ ఆలయాన్ని ఆయన సందర్శించారు. భక్తులకు విక్రయిస్తున్న సేవా టికెట్లు, అభిషేక పూజల టికెట్లు, రికార్డులను పరిశీలించి పలు సూచనలిచ్చారు. ప్రతిసేవకు భక్తులు కోరిన మేరకు టికెట్ ఇవ్వాలన్నారు. అధిక ధరలను వసూలు చేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. అలాగే ఆలయం వద్ద జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.

ఆశల వరి



శ్రీకావేరిరాజుపురంలో వరి సాగుకు అండతీస్తున్న కూలీలు



వెంగళరాజుకుప్పంలో వరినాట్లు వేస్తున్న మహిళలు

పాలసముద్రం : ఇటీవల అడపాదడపా కురిసిన వర్షాలకు రైతులు ఖరీఫ్ సాగుకు శుక్ర, శనివారంలో రెండో విడతలు దుక్కులు చేసి వరి పంట వేస్తున్నారు. మండలంలో బోరు, బావుల కింద ఉన్న రైతులు సుమారు 995 హెక్టార్ల భూమిలో వరి పంటలు, మరి కొంతమంది రైతులు 677 హెక్టార్లు వేరుశనగ పంటల సాగు చేస్తున్నారు. రైతులు ఏ పంట సాగు చేసిన ఎక్కువగా రసాయన ఎరువులు, పురుగు మందులను వాడడం వల్ల భూములు మొద్దు బారిపోయి దిగుబడి తగ్గిపోతుందన్నారు. ఈ నేపథ్యంలో స్థానికంగా లభించే ఆకులతో జీవామృతం, ఘనజీవామృతం తయారు చేసుకుని పంటకు ఉపయోగిస్తే అధిక దిగుబడి పొందవచ్చన్నారు. అందువల్ల రైతులు చాలా వరకు వ్యవసాయ యాధికారి సూచనలు పాటిస్తున్నారు.

వెంటాడుతున్న పెట్టుబడి ఖర్చులు ..

గడిచిన నాలుగేళ్లుగా గత ప్రభుత్వం రైతులకు సకాలంలో రైతు భరోసా పేరిట వ్యవసాయ పనుల పెట్టుబడి కోసం మే నెలలోనే నగదు జమ చేసేది. పీఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాల్లో జమ అయినా రాష్ట్రప్రభుత్వం ఇప్పటికీ పెట్టుబడి ఖర్చుల కోసం డబ్బు జమ చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు ఖర్చులు పెరిగిపోగా మరోవైపు ప్రభుత్వం ఇస్తానన్న డబ్బు ఖాతాల్లో వేయకపోవడం వల్ల రైతులు ప్రైవేట్ వ్యాపారుల వైపు చూస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.20 వేలు బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

వైఎస్సార్ జయంతి రేపు

పాలసముద్రం : దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ తులసి యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన ప్రతి గ్రామంలో, మండల కేంద్రంలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించాలని కోరారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు రాచపాళెంలో సోమవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకోవాలని సూచించారు. అందువల్ల కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరూ కృషి చేయాలని తెలిపారు.

నేడు ధ్వజస్తంభం ప్రతిష్ట

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు కన్నికలకొండపై వెలసిన శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయం ఎదుట ఆదివారం ధ్వజస్తంభం ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు గుంటూరు శివరామశర్మ, తారక రామశర్మ, భార్గవ శర్మ తెలిపారు. ఉదయం 7.30 గంటలకు గ్రామస్తులు, భక్తుల సమక్షంలో శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం సుబ్రమణ్యస్వామి ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ దీపిక

కార్వేటినగరం: సీజనల్ వ్యాధులపై విద్యార్థులు తప్పక అవగాహన కలిగి ఉండాలని ఆయుర్వేదిక్ డాక్టర్ దీపిక చెప్పారు. శనివారం కార్వేటినగరం మండలం డీఎంపురం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం కేశవులు ఆధ్వర్యంలో ప్రపంచ జూనోసిస్ డే సంధర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ దీపిక మాట్లాడుతూ జూనోసిస్ అనగా జంతువుల నుంచి మానవులకు సంక్రమించే వ్యాధులుగా చెప్పారు. ఈ వ్యాధుల పట్ల విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు తిరుమలరాజు, హరిత, వెంకటరమణయ్య, చిన్నయ్యశెట్టి, ఢిల్లీబాబు, మాలతి, రాములు, రంజిత్, దేశయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతల తీరు హాస్యాస్పదం



శ్యామ్‌లాల్

నింద్ర: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు ఎన్నికల్లో విడివిడిగా పోటీ చేసి ఉంటే వారు కూడా సింగిల్ డిపాజిట్‌కే పరిమితం అయ్యేవారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి 2024 ఎన్నికల్లో 11 సీట్లు మాత్రమే వచ్చాయని, తన పద్ధతి మార్చుకోకపోతే ఈసారి ఎన్నికల్లో సింగిల్ డిపాజిట్ సీట్లే వస్తాయనడం హాస్యాస్పదమన్నారు. కూటమి ప్రభుత్వం పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టడంతో మాజీ సీఎం వైఎస్ జగన్ ఆయనను పరామర్శించడంపైనా కూటమి నేతలు విమర్శలు చేయడం దుర్మార్గమన్నారు. అంతే కాకుండా మహానేత వైఎస్సార్ విగ్రహాలను కూల్చడం కూడా సరైన పద్ధతి కాదన్నారు.

లక్ష్మీ నరసింహ స్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి భక్తి ప్రపత్తులతో ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారికి పాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని సుంగధ పరిమళాలతో కూడిన వివిధ రకాల పుష్పాలు, తులసీ దళాలతో ఆకర్షణీయంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రాదాలు పంచి పెట్టారు.

గ్రానైట్ లారీ సీజ్



సీజ్ చేసిన గ్రానైట్ లారీ వద్ద అధికారులు

శ్రీరంగరాజపురం: అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న ఓ లారీని స్థానిక తహసీల్దార్ ఆల్‌ఫ్రెడ్ శనివారం రాత్రి మెరుపు దాడి చేసి సీజ్ చేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి అక్రమ గ్రానైట్ తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. కళ్లెదుటే గ్రానైట్ తరలిస్తున్నా చిత్తూరు వైపు వెళ్లే అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. శని, ఆదివారాలు అయితే అక్రమార్కులకు పండగే ! దాదాపు 15 నుంచి 20 లారీలు గ్రానైట్ రాళ్లను అక్రమంగా రవాణా చేస్తారు. గతంలో కొత్తపల్లిమిట్టలో చెక్‌పోస్టు ద్వారా గ్రానైట్ రాయి పరిమిట్లు, రాతి కొలతలు చెక్ చేసి పంపేవారు. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో చెక్‌పోస్టును మూసేశారు. దీంతో అక్రమ రవాణాదారులు రూ.లక్షలు దండుకుంటున్నారు. కొత్తపల్లిమెట్ట కూడలిలో సీసీ కెమెరాలు ఉన్నా కూడా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. స్థానికులు అక్రమ గ్రానైట్ తరలింపుపై సమాచారం అందించడంతో స్థానిక తహసీల్దార్ ఆల్‌ఫ్రెడ్ శనివారం రాత్రి మెరుపు దాడి చేసి లారీని సీజ్ చేశారు.

వైభవంగా ప్రసన్నుడి గ్రామోత్సవం



తిరుచ్చిపై విహరిస్తున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంట శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం వేకువజామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయల్లో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్‌సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరీలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయం చేరుకున్న స్వామి, అమ్మవార్లకు మంగళ హారతులు ఇచ్చి పవళింపు సేవ నిర్వహించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

పుత్తూరు: స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.కోటేశ్వరయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పాస్ అయిన విద్యార్థులు డిగ్రీలో చేరడానికి ఈనెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. కళాశాలలో బీఎస్సీ ఆనర్స్ డిగ్రీలో మేథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులు, బీకాంలో బీకాం (జనరల్), కంప్యూటర్ అప్లికేషన్స్, బీబీఏ, బీఏలో ఎకనామిక్స్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అత్యాధునిక సైన్స్ లేబొరేటరీలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, జిమ్‌తో పాలు మౌలిక సదుపాయాలన్నీ కళాశాలలో ఉన్నాయన్నారు. పీహెచ్‌డీ విద్యార్హత కలిగిన అధ్యాపకులతో అంకితభావ బోధనలు కళాశాల అత్యుత్తమ ఫలితాలకు నిదర్శనంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఏటా క్యాంపస్ సెలక్షన్స్ ద్వారా ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 91821 36020, 83745 56441 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బీఎస్పీ నేత హత్యపై ఆగ్రహం



నిరసన వ్యక్తం చేస్తున్న అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు

నగరి: తమిళనాడులో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్మ్‌స్ట్రాంగ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేయడాన్ని ఖండిస్తూ ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం నిరసన వ్యక్తం చేసింది. శనివారం బస్టాండు ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరిన వారు హత్యా ఉదంతాన్ని ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఎంకే ప్రకాష్ మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రంలో బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికే ఇలాంటి పరిస్థితి వస్తే సామాన్య ప్రజలకు రక్షణ ఎలా ఉంటుందన్నారు. దోషులను వెంటనే అరెస్టు చేసి వారికి ఉరి శిక్ష అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ హత్య వెనుక ఎవరి హస్తం ఉన్న రాజకీయ కక్ష సాధింపులు ఉన్నా వాటిని వెలికి తీసి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ అంశంపై తమిళనాడు ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి గోవిందస్వామి, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగూర్, సభ్యులు విజయ్, రజిని, జబరాజ్, రాజా, అల్లిముత్తు, కిరణ్, మహేష్, చిన్న రాజా తదితరులు పాల్గొన్నారు.

టీబీ నివారణకే బీసీజీ వ్యాక్సిన్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దుర్గాదేవి

గంగాధర నెల్లూరు: టీబీ జబ్బు నివారణ కోసం బీసీజీ వ్యాక్సిన్ వేసుకోవాలని డాక్టర్ దుర్గాదేవి అన్నారు. శనివారం పెద్దకాలువ పంచాయతీలోని ఎన్టీఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో మహిళలతో అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత ప్రభుత్వ నిబంధనల మేరకు టీబీ జబ్బు రాకుండా నివారించాలంటే బీసీజీ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. 18 ఏళ్లు పైబడిన వారు బీసీజీ వ్యాక్సిన్ వేసుకుంటే టీబీ రాదని, అలాగే 60 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బీసీజీ వ్యాక్సిన్ వేసుకోవాలని తెలిపారు. ధూమపానం పొగాకు అలవాటు ఉన్నవారు బీసీజీ వ్యాక్సిన్ వేసుకుంటే మంచిదన్నారు. గ్రామస్థాయిలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు బీసీజీ వ్యాక్సిన్ ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీనివాసులు, సిబ్బంది, అశావర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా సహకార దినోత్సవం



పతాకాన్ని ఎగురవేస్తున్న జిల్లా సహకార శాఖ విభాగ అధికారి



సహకార జెండాకు వందనం చేస్తున్న సిబ్బంది

నగరి : సహకార బ్యాంకుల ద్వారా రైతులకు మెరుగైన భవిష్యత్ ఉంటుందని జిల్లా సహకార శాఖ విభాగ అధికారి యు.వనజ అన్నారు. శనివారం 102వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరి పీఏసీఎస్‌కు విచ్చేసిన ఆమె సహకార పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సహకార సంఘాలు అంతర్జాతీయ దినోత్సవాన్ని జరుపుకుంటాయన్నారు. అందరికీ మంచి భవిష్యత్‌ను అందిస్తామన్న దీమాతోనే ఈ దినోత్సవం జరుగుతోందన్నారు. 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అమలు చేయడానికి ప్రయత్నాలు వేగవంతం చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నగరి, కోసలనగరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌లు కేవీఆర్ కుమార్, రమణయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రారు సులోచన, నగరి, అగరం రామకృష్ణ, సీఈఓలు కె.తులసిపిళ్లై, జి.సుబ్రమణ్యం, నగరి బ్రాంచి మేనేజరు సందీప్, సూపర్‌వైజర్ ఆనందన్, సొసైటీ సిబ్బంది గుణశేఖర్, లేపాక్షి, శేఖర్, దుర్గాప్రసాద్, కార్తీక్, తనికాచలం, వరప్రసాద్ రాధ, చంద్రమోహన్ పాల్గొన్నారు.

జీడీనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: రైతుల అభివృద్ధి, మెరుగైన భవిష్యత్తే సహకార సంఘం ప్రధాన లక్ష్యమని గంగాధర నెల్లూరు సింగిల్‌విండో పర్సన్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు రెడ్డి అన్నారు. 102వ అంతర్జాతీయ సహకార సంఘ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో సహకార జెండా ఎగురవేసి భారత మొదటి ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా సంఘ సభ్యులకు, రైతులకు మంచి జరగాలని, రైతుల అభివృద్ధే ప్రధాన లక్ష్యమన్నారు. రైతుల పురోభివృద్ధి కోసం అన్నివిధాలా సహాయ సహకారాలు అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో కార్యాలయ సీఈఓ విజయ్ కుమార్, డీసీసీబీ బ్యాంకు చీఫ్ మేనేజర్ మహేష్, విజయ, సింగిల్‌విండో స్టాఫ్ అసిస్టెంట్ మునస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి



తిరుపతి సిటీ: పారిశ్రామిక రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, యువత అవకాశాలను సద్వినియోగం చేసుకుని లక్ష్యాలను చేరుకోవాలని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎస్ సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కరకంబాడి రోడ్డులోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల రెండో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజంలో పోటీతత్వాన్ని ఎదుర్కొనే సామర్థ్యంతో స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల అధినేత డాక్టర్ సి.గంగిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశంలోనైనా చదువుకున్న వ్యక్తికి ప్రత్యేక గౌరవం ఇస్తారన్నారు. తమ కళాశాల విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ కల్పనే లక్ష్యంగా కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాధమునిరెడ్డి కళాశాల వార్షిక విద్యా నివేదికను సభకు వివరించారు. అనంతరం ముఖ్యఅతిథుల చేతుల మీదుగా బీటెక్ పూర్తి చేసుకున్న 503 మంది విద్యార్థులకు, 60 మంది పీజీ విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఐసర్ రిజిస్ట్రార్ విజయ్ మోహన్ పిళ్లై, డీన్ వి.వేణుగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద

వెదురుకుప్పం: మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. శనివారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద మాట్లాడుతూ గాలి కాలుష్యం పెరిగిపోతున్న క్రమంలో గ్రామాల్లో మొక్కల పెంపకాన్ని చేపట్టాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటేనే మానవ మనుగడకు దోహదం చేస్తుందన్నారు. చెట్లు నరికితే మానవాళి మనుగడకే అనేక అనర్థాలు దారి తీస్తుందని చెప్పారు. ఆరోగ్యవంతమైన సమాజానికి మొక్కలను పెంచడం మంచిదన్నారు. పచ్చదనాన్ని పెంచడం ద్వారా అనేక ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. ప్రతిఒక్కరూ విధిగా మొక్కలను పెంచాలని సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి మంగళగౌరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో శనివారం ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గుంటూరు వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాలతో దుకాణాల్లో ఎరువులు, విత్తనకాయల విక్రయాలపై విజిలెన్స్ అధికారులు ఆరా తీశారు. స్టాకు వివరాలు, ధరలు, అమ్మకాలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ప్రధానంగా గ్రోమోర్ దుకాణంలో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన ఎరువుల స్టాకుపై ఆరా తీశారు. తనిఖీల్లో భాగంగా రూ.2029 విలువ చేసే 32 కేజీల గ్రోవైడ్ ఎరువును నిల్వ ఉంచడాన్ని గుర్తించారు. అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువుకు సంబంధించి యజమానికి నోటీస్ ఇచ్చారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకే ఎరువులు, విత్తనకాయలు విక్రయించాలని సూచించారు. ఎరువుల విక్రయాల్లో అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే వెంటనే సంబంధిత విక్రయదారుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ఆత్మ డీపీడీ శివన్నారాయణ, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఏఓ వనిజ ఉన్నారు.